క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: ఆలయాల అభివృద్ధికి తమ సహకారం నిరంతరం కొనసాగుతుందని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో నిర్మాణ దశలో ఉన్న సంత్ సేవాలాల్ ఆలయ పనులను పరిశీలించి 50వేల రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గాంగ్యానాయక్, జాను పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మహిళలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని నాగసార్, తిర్మాలాపూర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 2లక్షల రుణమాఫీ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, నాయకులు రాములు, మొహన్‌నాయక్, వెంకట్రాములు, నర్సప్ప, రాజు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామచంద్రయ్య



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పరిగి: పరిగి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా న్యాయవాది రామచంద్రయ్యను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇబ్రాహీంఖాన్, ఉపాధ్యక్షులుగా నరసింహారావు, గోపాల్, జాయింట్ సెక్రటరీగా కౌసర్‌పాషను ఎన్నుకున్నారు. అనంతరం రామచంద్రయ్య మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారుల్లో ఫైలేరియా లక్షణాలపై సర్వే చేశారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల ని సూచించారు. డాక్టర్ రతన్‌లాల్, కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పక్కీ రప్ప, ఏఎన్‌ఎమ్‌లు మణెమ్మ, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్త మధు, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్ యాదవ్, ఆశ కార్యకర్త సులోచన పాల్గొన్నారు.

నేడు దుస్తుల పంపిణీ

కొడంగల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజమ్‌లకు దుస్తులు పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి దుస్తులు అందజేస్తారు. మండలంలోని అన్ని మసీదుల ఇమామ్‌లు మౌజమ్‌లు హాజరు కావాలని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

సంఘం అభివృద్ధికి పాటుపడాలి

పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

నవాబుపేట: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి పీఏసీఎస్ అభివృద్ధికి పాటుపడాలని ఆ సంఘం చైర్మన్ పోలీస్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అన్ని రకాల పంట రుణాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రైవేటు, కార్పొరేటు బ్యాంకులకు ఏ మాత్రం తీసిపోకుండా రైతులకు సహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘం మనది అనే భావన ప్రతి రైతుకూ రావాలన్నారు. డైరెక్టర్లు మల్లారెడ్డి, మల్లేషం, విఠల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్, ప్రభు, జనార్దన్, పుష్పమ్మ, సీఈఓ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం

డిప్యూటీ తహసీల్దార్ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ మోహన్

పెద్దేముల్: బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థాయిల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని డిప్యూటీ తహసీల్దార్ మోహన్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల చైల్డ్ అడ్వైజరీ బోర్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలకు ఎవరైన సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే నెల నుంచి అధికంగా వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున అంగన్‌వాడీలు, మహిళా సమాఖ్య సభ్యులు, పాఠశాలల ఉపాధ్యాయులు బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే రెవెన్యూ, పోలీస్, చైల్డ్ లైన్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం మండల చైల్డ్ లైన్ ఇన్‌చార్జ్ నర్సింలు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనులకు చిన్నారులు వెళుతున్నట్లు సమాచారం ఉందని, పిల్లలతో పనులు చేయించరాదని ఆ పథకం ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మాదేవిని కోరారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో జరిగే సభల్లో బాల్య వివాహాలు జరగకుండా పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీఓ షేక్‌సుష్మాను కోరారు. మారేపల్లి, జనగాం, గోట్లపల్లి, బండమీదిపల్లి, ఇందూరు, ఉరేంటి తండాతో పాటు మరి కొన్ని గ్రామాల్లో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, అలాగే తట్టెపల్లి, పాషాపూర్, మంబాపూర్, గోట్లపల్లి మోడల్ స్కూళ్లలో డ్రాపౌట్లు ఎక్కువగా అవుతున్నాయని నర్సింలు మండల అధికారుల దృష్టికి తెచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు బాల్య వివాహాలపై దృష్టి సారించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుష్మా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, పీఓ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, మీనాక్షి, బాలుర వసతి గృహ వార్డెన్ సంగమేశ్వర్, సీసీలు సత్యనారాయణ, లక్ష్మణ్, కేజీబీవీ ఉపాధ్యాయులు ఉమా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ

పరిగి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ సూచించారు. ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మిక హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాల అవలంబించడం వల్ల కార్మికులు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కేంద్రం తీరుతో రాజ్యాంగ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కష్టజీవుల డిమాండ్లను తీర్చడానికి తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



చలో పార్లమెంట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కోకట్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యాలాల: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, సీఎం కేసీఆర్ చొరవతో ప్రత్యేక నిధులు తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. పల్లె పల్లెకూ పైలెట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బషీర్‌మియా తండా, బామ్లానాయక్ తండా, కోకట్, రాఘవపూర్, అడాల్‌పూర్, బాణాపూర్, కమాల్‌పూర్, విశ్వనాథ్‌పూర్, గోవిందరావుపేట, యాలాల గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఒక్కో పంచాయతీకి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రజలు తెలంగాణ పథకాలు చూసి తమను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఏఎంసీ చైర్మన్ విఠల్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ బాబా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచులు మిత్రునాయక్, పీ హంసమ్మ, లక్ష్మీదేవి, శేఖర్, బాలిబాయి, బస్వరాజ్, సత్యమ్మ, సులోచన, ఉపసర్పంచ్ కృష్ణ, నర్సింహులు, నాయకులు శంకర్‌రెడ్డి, అమర్, పురుషోత్తంరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ భవన నిర్మాణానికి కృషి

యాలాల: నియోజకవర్గంలోని ఆర్ఎంపీల కోసం ప్రత్యేక భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంపీల సంఘం ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల కొడంగల్, పరిగి ప్రాంతాల్లో ఆర్ఎంపీ భవన్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పలువురు ఎమ్మెల్యేకు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఆర్ఎంపీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్దూం, తాండూరు అధ్యక్షుడు మౌలాన, జిల్లా జాయింట్ సెక్రటరీ పాష, యాలాల మండల అధ్యక్షుడు బోయిని సాయిలు, ఆర్ఎంపీలు శేఖర్, గణపతిరావు, హన్మంతు, పవన్, అక్బర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల బాధ్యత అధికారులదే

ఎస్ఐ రవిగౌడ్

కొడంగల్: సమాజంలో ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ప్రజలు చట్టాలను తెలుసుకొని బాధ్యతగా మెలగాలన్నారు. ప్రజలను చైతన్యం చేయడం కోసం గ్రామాల్లో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం, అధికారులు నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

దోమ: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దిర్సంపల్లిలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ శంకర్, గ్రామ సర్పంచ్ శాంతతో కలసి పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కుల వివక్ష లేకుండా గ్రామంలో అందరూ కలిసి మెలసి సోదర భావంతో ఉండాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.



కొడంగల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవిగౌడ్

హక్కులపై అవగాహన ఉండాలి

మర్పల్లి: పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సిరిపురం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ తుల్జారామ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్లాపూర్‌లో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, హెచ్‌ఎం, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

కొడంగల్: మండలంలోని అంగడిరాయిచూర్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అమ్మ నాన్న సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్, సభ్యులు, పాఠశాల సిబ్బంది అనిల్‌కుమార్, నరేష్‌రాజ్, వెంకట్‌రాములు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు - మన బడి పనులు ప్రారంభించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్తయ్య

అనంతగిరి: మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ సత్తయ్య సర్పంచ్‌కు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో ఎంపీడీఓ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో కలిసి పల్లె ప్రకృతి వనం, హరిత హారం నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టు షెడ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని సూచించారు. కంపోస్టు షెడ్‌లో మిగిలిన పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించారు.

ముస్లింలకు విందు



దోమ: రంజాన్ పండుగ సందర్భంగా నెల రోజుల పాటు చేసే ఉపవాస దీక్షల వల్ల పాపాకార్యాలు దూరమవుతాయని బొంపల్లి యువకులు సాయికుమార్, భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొంపల్లి మసీదులో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిలకు పండ్లు, భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు బాబర్, షఫీ, మోయిజ్, అక్రమ్, మైను, కలీం, కయ్యూమ్, ఇబ్రహీం, ప్రసాద్, మదీన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేపడతామన్న బీజేపీ ప్రభుత్వం తన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు స్వామిదాసు, రవి, నర్సింలు, మహేందర్, పుష్పరాణి, మల్లేశం, సుభాష్, మల్కప్ప, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో జాప్యం వద్దు



పీఏసీఎస్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: పీఏసీఎస్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆ సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ. 1.60కోట్ల నాబార్డు నిధులతో పీఏసీఎస్ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లో పనుల్లో జాప్యం చేయరాదన్నారు. పాత భవనంలో కార్యాలయం నిర్వహిస్తుండడం వల్ల గోదాం సమస్య ఎదురవుతోందని తెలిపారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే దుకాణాల ద్వారా పీఏసీఎస్‌కు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. గ్రౌండు ఫ్లోర్‌లో అద్దె ఇవ్వడం, ఫస్ట్ ఫ్లోర్‌లో కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. డైరెక్టర్లు బిచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, విఠల్‌రెడ్డి, సామెల్, రవీందర్‌రెడ్డి, సీఈఓ శేఖర్ పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించండి



సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పెద్దేముల్: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజురు చేయాలని పలు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలో అద్దె భవనాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలని కోరారు. అలాగే మూత్రశాలలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఇందూరు, జైరాం తండా(ఇందూరు), తట్టెపల్లి, కందనెల్లి తండా, మంబాపూర్, జనగాం, జైరాం తండా(తట్టెపల్లి) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, పాఠశాలలు, డ్వాక్రా భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు మేలు

పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



గెలుపొందిన వారికి పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

దోమ: సహకార సంఘాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పీఏసీఎస్ చైర్మన్ డీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాల గ్రామంలో సర్పంచ్ సుజాతతో కలసి గొల్లకుర్మల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గొల్లకుర్మల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఓ శంకరాచారి, ఉప సర్పంచ్ లాల్యనాయక్, ఎంపీటీసీ బసయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రాజ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తైబజార్‌కు వేలం

పెద్దేముల్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచ్ డీ విజయమ్మ అధ్యక్షతన తైబజార్, వాటర్ ఫిల్టర్‌కు వేలం నిర్వహించారు. తైబజార్‌ను పీ రాములు రూ. 71,800లకు దక్కించుకున్నారు. వాటర్ ఫిల్టర్‌ను బీ వెంకటయ్య రూ. 1,17,100కు సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు అరవింద్, మల్లేశం, ఫయాజ్, బాలమణి, సత్తార్‌ఖాన్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట మండలంలో..

బొంరాస్‌పేట: మండలంలోని తుంకిమెట్ల గ్రామ తైబజారుకు శుక్రవారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాజు రూ. 1.50లక్షలకు తైబజారు దక్కించుకున్నాడు. ఎంపీడీఓ పాండునాయక్, సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ తిరుపతయ్య పాల్గొన్నారు.

మర్పల్లి మండలంలో..

మర్పల్లి: స్థానిక పంచాయతీ కార్యాలయలో శుక్రవారం తైబజార్‌కు వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బీ రాజు వేలంలో తైబజార్‌ను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. పంచాయతీ నిబంధనల ప్రకారం వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

మర్పల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బాబు జగ్జీవన్‌రావు విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్ కోరారు. కార్యక్రమంలో బీజేఆర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, టీడీపీ వికారాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ దివాకర్, బీఎస్సీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

• ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాండూరు రూరల్: మండలంలోని గోనూర్ గ్రామంలో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డికి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనంత్ రెడ్డికి సంబంధించిన ట్రాక్టర్ గోనూర్ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. కరన్‌కోట్ పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

• సమస్యలు పరిష్కరించండి



డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు

కుల్కచర్ల: తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సర్వశిక్షా అభియాన్ ఉద్యోగ సంఘం జిల్లా నాయకులు గాంగ్యానాయక్, రఘుసింగ్ ఠాకుర్ కోరారు. శుక్రవారం ఈ మేరకు మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెర్ప్ ఉద్యోగుల తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీసీసీబీ చైర్మన్ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణయ్య, లక్ష్మయ్య, సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

• ఆదుకుంటాం

దోమ: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఐనాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాయిలు తండ్రి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ పరామర్శించారు. రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రుక్మయ్య, పాఠశాల చైర్మన్ సాయిలు, కార్యకర్తలు ఆంజనేయులు, లక్ష్మణ్, రాములు పాల్గొన్నారు.

• ఆర్థిక సాయం

దోమ: పేద కుటుంబాలను ఆదుకుంటామని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మోత్కుర్ గ్రామానికి చెందిన గూడ వెంకటమ్మ, గట్టు నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ అంత్యక్రియల నిమిత్తం శుక్రవారం రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, మల్లయ్య, వెంకటయ్య, అంజిలయ్య, చంద్రయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

• వీడ్కోలు



కుస్మసముద్రం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: మండలంలోని కుల్కచర్ల బాలికల పాఠశాల, ముజాహిద్‌పూర్, కుస్మసముద్రం జెడ్పీహెచ్ఎస్‌లలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఘనంగా వీడ్కోలు పలికారు.

• సర్వే చేయండి



రసీదును చూపుతున్న లలితాబాయి

పెద్దేముల్: భూమి సర్వే కోసం మీ సేవ కేంద్రంలో డబ్బు కట్టి నాలుగు నెలలు దాటినా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజన మహిళ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మండలంలోని రచ్చకట్ట తండాకు చెందిన లలితాబాయి మాట్లాడుతూ.. ఇరువై రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించింది. మండల సర్వేయర్ ఎక్కడ ఉంటాడో, ఎప్పుడు కార్యాలయానికి వస్తాడో తెలియడం లేదన్నారు. వెంటనే తన భూమిని సర్వే చేయాలని ఆమె అధికారులను కోరింది.

• కరోనా పరీక్షలు

పెద్దేముల్: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం కరోనా పరీక్షలు ప్రారంభించారు. రోజుకు ఐదు మందికి కరోనా పరీక్షలు చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపింది. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధిగా మాస్కులు ధరించాలని వైద్యులు సూచించారు.